

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**SEPTEMBER - 2015**

సంవత్సర చందా రూ. 50/-

# బైబిలు కన్వెన్షన్
# సత్యవాణి-క్రీస్తుసంఘము

స్థలము: క్రీస్తుసంఘము,
7-9-35 సాంబమూర్తివీధి, సత్యవాణి, కాకినాడ.

తేదీలు: 2015 నవంబరు 3,4,5,6 తేదీలలో
మంగళ, బుధ, గురు, శుక్రవారములు

సమయం: ఉదయం 10:00 గం॥లకు
మధ్యాహ్నం 2:00 గం॥లకు
సాయంత్రం 7:00 గం॥లకు

ప్రసంగీకులు: బ్రదర్. జిమ్ కెల్లీ, యు.ఎస్.ఏ
బ్రదర్. రోజర్ రైట్, యు.ఎస్.ఏ
బ్రదర్. లూయిస్ రష్మోర్, యు.ఎస్.ఏ
బ్రదర్. రాజా నాయగమ్, కంగయామ్, తమిళ్‌నాడు
మరియు స్వదేశ సువార్తికులు

మీరు సకుటుంబ సపరివారముగా , మీ స్థానిక సంఘముతో కలసి రండి. భోజన వసతులు ఉచితం. మొదటి రోజున 20 రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవలెను. అందరికి స్వాగతం.

బ్రదర్. జాషువాగూటం
బ్రదర్. రిక్కీగూటం
0884-2363722
98489 98547

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, KAKINADA, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 36 | సెప్టెంబరు- 2015 | సంచిక - 2


## సాటిలేని యేసు మాటలు

(Never Man Spoke Like Jesus)

యేసు అద్భుతకార్యములు, సూచక క్రియలు చేయుచు బహిరంగముగా ప్రజలకు దేవుని గూర్చి బోధించుచుండగా యూదుల ప్రధానయాజకులును,పరిసయ్యులును ఒకనాడు ఆయనను పట్టుకొనుటకు బంట్రోతులను పంపిరి.ఆ బంట్రోతులు వచ్చి యేసు జీవ జలములను గూర్చి బోధించుట వినిరి.యేసు ఇట్లు బోధించెను: "ఎవడైనను దప్పిగొనిన యెడల నా యొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను.నాయందు విశ్వాసముంచువాడెవడో లేఖనము చెప్పినట్లు వాని కడుపులో నుండి జీవజల నదులు పారును"(యోహాను7:37,38). ఆ బంట్రోతులు ప్రధాన యాజకుల యొద్దకును పరిసయ్యుల యొద్దకును వచ్చినప్పుడువారు-ఎందుకుమీరాయనను తీసుకొని రాలేదని అడుగగా, ఆ బంట్రోతులు-ఆ మనుష్యుడు మాట్లాడినట్లు ఎవడును ఎన్నడును మాటలాడ లేదనిరి"(యోహా 7:45,46). అవును,యేసు బోధించిన విధముగ బోధించినవాడు ఆయనకు ముందుగాని, ఆయనకు వెనుకగాని ఎన్నడు ఉద్భవించ లేదు.యేసు బోధలో యున్న ప్రత్యేకతను

ఈ రోజు మనము కొంత గమనింతము.

**యేసుక్రీస్తు బోధించినవుడు అధికారము గలవానిగా బోధించెను.** మున్నెన్నడు ఏమనుష్యుడు అట్టి అధికారముతో బోధింపనేలేదు. కొండమీద ఆయన చేసిన ప్రసంగములో ధర్మశాస్త్రమునైనను, ప్రవక్తల వచనములనైనను కొట్టివేయ వచ్చితినని తలంచవద్దు. నెరవేర్చుటకే గాని కొట్టి వేయుటకు నేను రాలేదు అని ఆయన బోధించెను (మత్తయి 5:17). తరువాత ఒకడు నీతిమంతునిగా తీర్చబడవలెనన్న ధర్మశాస్త్రము కంటే మిన్నయైన ఆయన ఆజ్ఞలకు లోబడవలెనని యేసు బోధించెను. ధర్మశాస్త్రములోని కొన్ని ఆజ్ఞల నెత్తి చూపించి, నీతిమంతునిగా తీర్చబడ గోరువాడు వాటికంటె ఎక్కువ చేయవలెనని ఆయన బోధించెను. వాటిలో కొన్నిటిని ఇప్పుడు మనము చూచుకొందము.

"నరహత్య చేయవద్దు, నరహత్య చేయువాడు విమర్శకు లోనగునని పూర్వికులతో చెప్పబడినమాట మీరు విన్నారు గదా. నేను మీతో చెప్పున దేమనగా-తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును, ద్రోహి అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును"(మత్తయి 5:21-23). ధర్మశాస్త్ర ప్రకారము నరహత్య చేయువాడే విమర్శింపబడేవాడు గాని క్రీస్తు చట్ట ప్రకారమయితే తన హృదయములో తన సహోదరుని ద్వేషించువాడు నరకాగ్నికి లోనగును. మోషే ధర్మశాస్త్రము ఒకని బాహ్య ప్రవర్తననుబట్టి విమర్శించునట్టిది గాని, క్రీస్తు చట్టమయితే ఒకని హృదయ తలంపులను బట్టి విమర్శించునది. ఇందులో ఏది శ్రేష్ఠమైనది?

"వ్యభిచారము చేయువద్దని చెప్పబడిన మాట మీరు విన్నారుగదా నేను మీతో చెప్పునదేమనగా-ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసిన వాడగును" అని యేసుక్రీస్తుబోధించెను(మత్తయి5:27). "తన భార్యను విడనాడు వాడు ఆమెకు పరిత్యాగ ప్రతిక యియ్యవలెనని చెప్పబడి యున్నదికదా; నేనుమీతో చెప్పునదేమనగా వ్యభిచార కారణమును బట్టిగాక, తన భార్యను విడనాడు ప్రతివాడును ఆమెను వ్యభిచారిణిగా చేయుచున్నాడు. విడనాడబడిన దానిని పెండ్లాడు వాడు వ్యభిచరించుచున్నాడు"(మత్త 5:31-32).

"మరియు-నీవు అప్రమాణము చేయక నీ ప్రమాణములను ప్రభువునకు చెల్లింపవలెనని పూర్వీకులతో చెప్పబడిన మాట మీరు విన్నారుగదా,నేను మీతో చెప్పున దేమనగా-ఎంత మాత్రము ఒట్టు పెట్టుకొనవద్దు-మీ మాట అవునంటే అవును, కాదంటేకాదు అని యుండవలెను. వీటికి మించునది దుష్టుని నుండి పుట్టునది" (మత్తయి 5:33-37).

"కంటికి కన్ను,పంటికి పన్ను అని చెప్పబడిన మాట మీరు విన్నారుగదా,నేను మీతో చెప్పునదేమనగా దుష్టుని ఎదిరింపగ నిన్ను కుడిచెంప మీద కొట్టువాని వైపునకు ఎడమ చెంప కూడ త్రిప్పుము.ఎవడైన నీ మీద వ్యాజ్యమువేసి నీ అంగీ తీసికొనగోరిన యెడల వానికి నీపై వస్త్రము కూడ ఇచ్చి వేయుము.ఒకడు మైలు దూరం రమ్మని బలవంతము చేసిన యెడల,వానితో కూడ రెండు మైళ్ళు వెళ్ళుము.నిన్ను అడుగు వానికిమ్ము,నిన్ను అప్పు అడుగగోరు వాని నుండి నీ ముఖము త్రిప్పుకొన వద్దు" (మత్తయి 5:38-42).

"నీ పొరుగువాని ప్రేమించి,నీ శత్రువును ద్వేషించు మని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా;నేను మీతో చెప్పునదేమనగా,మీరు పరలోకమందు మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి,మిమ్మును హింసించువారి కొరకు ప్రార్థన చేయుడి" యని యేసు అధికారముతో బోధించెను (మత్తయి 5:43,44).

యేసు ధర్మశాస్త్రము నుండి యెత్తి చూపించిన ఆరు సంగతులను ఇప్పటి వరకు మనము గమనించితిమి. ప్రతి సందర్భములోను యేసు ఆ సంగతి చెప్పి,అది అట్లున్నట్లు మీరు విన్నారుగదా, అయితే నేను మీతో చెప్పునదేమనగా అని చెబుతు ధర్మశాస్త్రము విధించిన దానికంటే మరింత శ్రేష్ఠమైన విధులను క్రీస్తు బోధించెను.నేను చెప్పునదేమనగాయని ఆయన బోధించుటలో మోషే కంటే శ్రేష్ఠుడైన వాడని,ధర్మశాస్త్రమును మించిన యాజ్ఞలను ఆజ్ఞాపించు అధికారము గలవాడని క్రీస్తు నిరూపించుకొనెను. అందుకే"యేసు ఈ మాటలు చెప్పి ముగించినప్పుడు జన సమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె కాక అధికారముగలవాని వలె వారికి బోధించెను"(మత్తయి 7:28,29).

అంతేకాదు, యేసు పలికినంత మృదువుగా ఏ మానవుడు ఎన్నడు

పలుకలేదు.ఆయన ఇట్లనుచున్నారు. "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా,నాయొద్దకు రండి,నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను,దీనమనస్సుగలవాడను గనుక మీమీద నాకాడి ఎత్తుకొని నాయొద్ద నేర్చుకొనుడి;అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును,ఏలయనగా నాకాడి సుళువుగాను,నా భారము తేలికగాను ఉన్నవి"(మత్తయి 11:28-30).

యేసు బోధించినంత ప్రేమతోను,కరుణతోను ఏ మానవుడు ఎన్నడు బోధించి యుండలేదు."నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము మీరొకని నొకడు ప్రేమించవలెననుటయే నా ఆజ్ఞ. తన స్నేహితుల కొరకు ప్రాణము పెట్టువాని కంటే ఎక్కువైన ప్రేమగల వాడెవడును లేదు.నేను మీ కాజ్ఞాపించు వాటిని చేసిన యెడల మీరును నా స్నేహితులైయుందురు" (యోహాను 9:13-14).దేవుని ప్రేమను మానవులకు చాటుటకు యేసు ఈ లోకమునకు వచ్చెను.ఆ ప్రేమను ఆయన తన జీవితములో మున్నెన్నడు ఎవడు నిరూపించని రీతిగ నిరూపించెను.

యేసు బోధించిన రీతిగ నిరీక్షణ గలిగిన మాటలను ఏ మానవుడు ఎన్నడు బోధించలేదు."మీ హృదయమును కలవరపడనియ్యకుడి;దేవుని యందు విశ్వాసముంచుచున్నారు.నా యందును విశ్వాసముంచుడి.నా తండ్రి యింట అనేక నివాసములు కలవు ,లేని యెడల నేను మీతో చెప్పుదును;మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను.నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును"అని యేసు బోధించెను (యోహాను 14:1-3). మరల, పునరుత్థానమును జీవమును నేనే;నా యందు విశ్వాసముంచు వాడు చనిపోయినను బ్రతుకును;బ్రతికి నా యందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు"అని సమాధి యనంతరము నిరీక్షణ మనము కలిగియుండునట్లు యేసు బోధించెను(యోహాను 11:25,,26).

యేసు చేసిన వాగ్దానములను ఏ మానవుడు ఎన్నడు చేయలేదు. మార్కు 16:16లో, నమ్మి బాప్తిస్మము పొందిన వానికి ఆయన రక్షణను వాగ్దానము చేసెను. తన శిష్యులు సర్వజనులను శిష్యులుగా చేయవలెను. వారికి సువార్త బోధించి తండ్రి యొక్కయు,

కుమారుని యొక్కయు పరిశుద్ధాత్ముని యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు ఆయన ఆజ్ఞాపించిన సంగతులన్నియు వారు గైకొనవలెనని బోధించినపుడు ఆయన యుగసమాప్తి వరకు సదాకాలము వారితో ఉందునని వాగ్దానము చేసెను(మత్తయి 28:19-20).

మనకు పాపక్షమాపణను, రక్షణను దయచేయువాడు యేసుక్రీస్తే. ఆయన గొప్ప రక్షకుడు. ఆయన తప్ప మనుష్యులను తమ పాపముల నుండి విడిపించువాడు మరొకడు లేడు. నీవు యేసుక్రీస్తునందు విశ్వాసివా? అయితే సాటిలేని యేసు మాటలను బట్టి నీ పాపముల విషయమై మారుమనస్సు నొంది ఈ నాడే క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుము!!

బల్యర్పణ పద్ధతి 12

# పాప పరిహారార్థబలి

## (The Sin offering)

ఈ పాఠంలో లేవీయుల పాప పరిహారార్థబలిని గూర్చి తెలిసికొందము. దీని సంస్కార విధము కొంత వేరుగా యుండును. యిది నేరుగా యేసుక్రీస్తును సూచించునట్టిది. యిది యింపైన సువాసనగల యాగము కాదు. యిది అతి పరిశుద్ధమైన యాగములోనికి వచ్చును. పాప పరిహారార్థబలిని గూర్చి లేవీకాండము 6:24 నుండి 30 వరకు మరియు సంఖ్యాకాండము15:21-22లలో వివరించబడినది.

**హాట్టా :**

పాప పరిహారార్థబలిని హెబ్రీ భాషలో హట్టాయని అందురు. పదిఆజ్ఞలలో మొదటి ఐదింటిలో దేనినైనా అతిక్రమించినప్పుడు ఈ బలి కోరబడినది. ఇంకొక మాటలో మానవుని పాపము వలన దేవుని హక్కులు ఉల్లఘించబడును. దేవుని యొక్క తత్వమును,ఘనతయును అతిక్రమించబడినప్పుడు, ఆయనను గూర్చిన ఆజ్ఞలకు అవిధేయత చూపినప్పుడు యిది కోరబడినది.

**విడగొట్టబడిన సహవాసము :**

ఒకడు పాపము చేయగా దేవునికి,ఆ వ్యక్తికి మధ్యనున్న సహవాసము తెగిపోయినదని ఈ బలి సూచించును.

మరియు ఆ వ్యక్తి దేవునితోను ఇశ్రాయేలు జనాంగముతోను నిబంధన సంబంధము లో వుండదు. దేవునితో ఆ సహవాసము పునరుద్ధరింపబడుటకు ఈ బలి యర్పింప బడవలెను. పాతనిబంధన లో గాని, క్రొత్త నిబంధనలో గాని బుద్ధిపూర్వకముగానో లేక అజ్ఞానమువలననో చేసిన పాపము పాపమే. తెలిసో లేక తెలియకో చూపించిన అవిధేయత వలన కలిగిన పాపముకు పరిహారము జరిగించ బడవలెను. అప్పుడు మాత్రమే సహవాసము పునరుద్ధరించ బడును. దేవుని తత్వానికి బహిరంగముగా అవఘనత తెచ్చిన పాపమేదైనా దానికి పరిహారము జరుగవలెను. పాపముకు అజ్ఞానము ఒక సాకుకాదు. మోషే ధర్మశాస్త్ర ప్రకారమున్న యాజకులు "ఏమియు తెలియని వారి యెడలను త్రోవతప్పిన వారి యెడలను తాలిమి చూపగలవారై యున్నారని" హెబ్రీ 5:2 చెప్పుచున్నది. రెండు రకాలైన ప్రజలున్నారు. ఒకడు ధర్మశాస్త్రము యెరుగకయే దానిని అతిక్రమించిన వాడైనను అతడు అపరాధియగును. మరొకడు ధర్మశాస్త్రమునెరిగి యుండియు బుద్ధి పూర్వకముగా దాని నుండి తొలగిపోయినవాడు. అతడును అపరాధియే. ఈ యిద్దరు పాపులే.

ఒకడు ధర్మశాస్త్రము విషయంలో అజ్ఞానినని వాదించి దానిశిక్షనుండి తప్పించు కొనలేడు. పాపము చేయుటకు సృష్టినుండియే మానవుని లక్షణమని తలంచుట జ్ఞానయుక్తము కాదు. పాపము చేయుట మానవుని తత్వముకాదు. అట్లయితే యేసు యొక్క పవిత్రతను ఎట్లు వివరించ గలము? పాపము చేయునట్లు దేవుడు మానవుని తయారు చేయలేదు.

**పాపము వారసత్వము వలన కలుగదు**

దానిని మనం ఆదాము హవ్వల నుండి వారసత్వముగా పొందలేదు. ప్రతివ్యక్తి కూడ దేవుని ఆజ్ఞను అతిక్రమించువరకు అమాయకుడే, పవిత్రుడే. నిజమే, యితరుల నుండి పాపమును నేర్చుకొనవచ్చును. గాని అది ఆ మనుష్యుని యొక్క వ్యక్తిగత నిర్ణయమే గాని వేరొకటికాదు. అందుకే "మోసపోకుడి దుష్టసాంగత్యము మంచి నడవడిని చెరపును" అని పౌలు చెప్పాడు (1కొరింధి 15:33). వారసత్వము వలన సంక్రమించు పాపమును గూర్చి బైబిలులో ఎక్కడ లేదు. యెహెజ్కేలు 18:1-32 వరకు జాగ్రత్తగా చదువండి. "కాబట్టి ఇశ్రాయేలీయులారా యెవని ప్రవర్తనను బట్టి వానికి

శిక్షవిధింతును "అని యెహోవా సెలవిచ్చెను (యెహెజ్కేలు 18:30).

**హేయ క్రియ సంబంధ పాపము**

మోషే ధర్మశాస్త్ర ప్రకారము హేయమైన చెడ్డక్రియల పాపములు కొన్నియున్నవి. దేవుని పరిపాలనను బహిరంగముగా నిరాకరించుట వలన యిది కలుగును. యిట్టి పాపము చేయువాడు దేవునితో నేరుగా పోరాడువానివలె అగుపడును. ఇవ్విధమైన పాపముకు మోషేధర్మశాస్త్రప్రకారము పరిహారము యేమిలేదు. అహంకార భావముతో చేయుపాపములను గూర్చి ద్వితీ 17:6-7;లేవీ 24:14లో చెప్పబడినది. అట్టివానిని పాళెము వెలుపలకు తీసికొనిపోయి రాళ్లు రువ్వి చంపవలెను. తద్వారా దేవునితోను, ఇశ్రాయేలుతోను వాడు సహవాసమును కోల్పోవును. "ఎవడైనను మోషే ధర్మశాస్త్ర మును నిరాకరించిన యెడల ఇద్దరు ముగ్గురు సాక్షుల మాటమీద కనికరింపకుండ వాని చంపించుదురు" (హెబ్రీ 10:28). అహంకారము వలన చేయుపాపములు గాక, అజ్ఞానమువలన, బుద్ధిహీనత వలన జరిగించు పాపములకు పాపపరిహార బలి కలదు.

**పాపపరిహారము, ఒక క్రొత్తయుగము**

పాపపరిహారబలి. అతిక్రమ యూగము అనునవి ఇశ్రాయేలీయుల కీయబడిన క్రొత్తశాసనములు. మనం ఇంతవరకుచదివిన దహనబలి, నైవేద్యము, సమాధానబలి మొ॥నవి మోషే ధర్మశాస్త్ర ముకు ముందు నుండే యున్నవి. గాని పాప పరిహారార్థబలి, అతిక్రమ బలి యనునవి అగువడవు. పాపపరిహార బలులు అర్పించబడినట్లు మాత్రము యోబు 1:5 చెప్పుచున్నది. ఆకాలమందు నిర్ధేశింపబడిన యాజకులుగాని, యాజక ధర్మము గానిలేదు, గాని ఆయాగోత్రకర్తలు తమ కుటుంబముకు యోబువలె యాజకులుగా పనిచేసిరి.

**యేసుఒక్కడు మాత్రమే పాపపరిహార్థబలి**

మోషే ధర్మశాస్త్ర ప్రకారము జంతు బలులు పాపమును తీసి వేయలేక పోయెననుట విదితమే. ఎడ్లయొక్కయు, మేకల యొక్కయు రక్తము పాపమును తీసి వేయుట అసాధ్యమని హెబ్రీ 10:4,10 చెప్పుచున్నవి. అయితే ధర్మశాస్త్ర ప్రకారము పాపాపరిహారబలులుకొరకు, అతిక్రమముల కొరకు బలులు అర్పించిన తరువాత, ఆ వ్యక్తి క్షమించబడెనని చెప్పబడెను. "వానికి క్షమాపణ కలుగును" అని లేవీ

4:20,26,31,35; 5:10; 16:6-7 చెప్పుచున్నవి. జంతు రక్తము వలన అతడు క్షమించబడలేదు. జంతు రక్తము లేకుండా కూడ క్షమించబడలేదు. ఏలయనగా "రక్తము చిందింపబడకుండా పాపక్షమాపణ కలుగనేరదు"అని ధర్మ శాస్త్రము చెప్పుచున్నది (హెబ్రీ 9:22).

తనకుబదులుగా వధింపబడిన జంతు రక్తము ప్రోక్షింపబడకుండా హెబ్రీయుడు క్షమాపణ పొందలేదు. పాపపరిహార నిమిత్తము యిచ్చిన దేవుని ఆజ్ఞకు విధేయత చూపుటవవలన అతడు క్షమాపణనొందును. ఆ బలి ద్వారా యేసుక్రీస్తు సిలువపై అర్పించిన విమోచన బలికి నేరుగా సంబంధము యేర్పడినది. ఇశ్రాయేలీయుడు అర్పించిన జంతు రక్తము ద్వారాగాక, దేవుడే కల్వరిలో చేయబోవు బలిని బట్టి అతడు క్షమాపణ నొందెను.

"పూర్వము చేయబడిన పాపములను దేవుడు తన ఓరిమి వలన ఉపేక్షించినందున ఆయన తన నీతిని కను బరచవలెనని క్రీస్తుయేసు రక్తము నందలి విశ్వాసము ద్వారా ఆయనను కరుణాధారముగా కనుబరచెను"అని రోమా 3:25-26 చెప్పుచున్నది. పూర్వము చేయబడిన పావములు అనగా పాతనిబంధన కాలములోనివి. "ఈ హేతువు చేత మొదటి నిబంధన కాలములో జరిగిన అపరాధముల నుండి విమోచనము కలుగుటకై ఆయన మరణము పొందినందున పిలువబడినవారు నిత్యమైన స్వాస్థ్యమును గూర్చిన వాగ్దానమును పొందు నిమిత్తము ఆయన క్రొత్తనిబంధనకు మధ్యవర్తియై యున్నాడని"హెబ్రీ 9:15 ఈ సత్యమును నిర్ధారించుచున్నది.

**దశల వారి బాధ్యత**

ప్రజలు దశలవారిగా బాధ్యతలు కలిగియుండిరి. అపరాధము యొక్క భారము హెచ్చుతగ్గులుగా యుండెను. అందువలన వారి పాపము యొక్క పర్యవసానములోను, అర్పించవలసిన జంతువుల లోను, రక్తప్రోక్షణ జరుగవలసిన స్థలములోను, జంతువు యొక్క శరీర విషయము లోను గొప్ప వ్యత్యాసము కనబడును. ఇందులో నాలుగు దశలగా యున్నబాధ్యత కనబడును.

**ప్రధానయాజకుడు:**

ఇశ్రాయేలు జనాంగములో అత్యున్నత స్థానములో యున్నవాడు పాపము చేయగా దాని పర్యవసానము ఆ జనాంగమున కంతటికి కలుగును,

బాధ్యతవిషయంలో ప్రధాన యాజకుడు ప్రథమస్థానములో యున్నాడు. అతడు ఇశ్రాయేలీయులకు దేవుని ప్రతినిధి మరియు దేవునియొద్ద ఇశ్రాయేలీయులకు ప్రతినిధి. అందువలన అతడు అత్యున్నత స్థానములో యున్నవాడు. అతడు పాపము చేయగా జనాంగమునకంతటికీ దాని పర్యవసానము కనబడును. ప్రధాన యాజకుడైన అహరోను ఒక బంగారు దూడను చేయించి ఇశ్రాయేలీయులను విగ్రహారాధన లోనికి నడిపించుట ఒక ఉదాహరణయై యున్నది. అతడు ఇశ్రాయేలీయుల ఉపదేశకుడు, నైతికంగాను, ఆధ్యాత్మికంగాను వారిని పెడత్రోవను పట్టించగలడు. అతడు దేవునిచే అభిషేకించబడినవాడు (లేవీ 4:3).

**రెండవస్థానము ఇశ్రాయేలీయుల సర్వసమాజముకు చెందును**

ఇశ్రాయేలీయులు పాపము చేయుటకు ప్రధానయాజకుడు కారకుడయితే, అతడే శిక్షించబడును. ఒక్కోసారి సమాజమంతయు పాపము చేయవచ్చును. వారు విశ్వాస భ్రష్టత్వములో పడవచ్చును.

**ఇశ్రాయేలీయుల అధికారి:** మూడవ దశగల బాధ్యత గలవాడు. అతడొక ఏలిక, న్యాయాధిపతి, రాజకుమారుడు, తదుపరి రాజు కావచ్చును (లేవీ 4:22).

**సమాజములోని సామాన్య సభ్యుడు** నాల్గవ దశ బాధ్యత గలవాడు. అందువలన ఒకమనుష్యుడు వహించు బాధ్యతను బట్టి అతని అపరాధము దాని పరిహారము నిర్ణయించబడెను.

ఈ నాలుగు రకములైన బాధ్యతలు ప్రధాన యాజకునితో ఆరంభమగును. ఇశ్రాయేలీయులు పాపము చేయగా దేవుడు ప్రధాన యాజకుని బాధ్యునిగా చేయునని యెహెజ్కేలు 9వ అధ్యాయము తెలియజేయు చున్నది. అక్కడ దేవుడు పాపము చేసిన వారిని ఎవరిని విడిచిపెట్టక అందరిని హతము చేయుడని చెప్పెను(యెహెజ్కే 9:6).

"నా పరిశుద్ధ స్థలము దగ్గర మొదలుపెట్టి కటాక్షమైనను కనికరమైనను లేకుండ అందరిని హతము చేయుడని" ఆయన చెప్పెను. ఏలయనగా దేవుని దృష్టిలో అక్కడ జరిగే పాపము బహు హేయమైనది. అందువలననేనాసహోదరులారా, బోధకులమైన మనము మరి కఠినమైన తీర్పుపొందుదమని తెలిసికొని మీలో అనేకులు బోధకులు కాకుండుడి" యని యాకోబు హెచ్చరించాడు (యాకోబు 3:1).

పౌలు తిమోతికి వ్రాస్తూ, "నిన్నుగూర్చియు నీ బోధను గూర్చియు జాగ్రత్త కలిగియుండుము. వీటిలో నిలకడగా యుండుము. నీవీలాగు చేసి నిన్నును నీ బోధను వినువారిని రక్షించు కొందువు"అని చెప్పెను(1తిమోతి 4:16).

**నాలుగు బలి పశువులు**

ఈ నాలుగు దశల బాధ్యత వలన బలి యర్పించబడవలసిన పశువు కూడ నిర్ణయించబడెను.ప్రధమ బాధ్యత ప్రధానయాజకునిదని గమనించాము.అతడొక ఎద్దును అర్పించవలెను.సర్వసమాజము కూడ ఎద్దునే అర్పించవలెను.అధికారియైతే మగ గొర్రెను,సామాన్యుడైతే ఆడ గొర్రెను అర్పించవలెను.అతడు గొర్రెపిల్లను తేజాలని యెడల తాను చేసిన అపరాధము విషయమై రెండు తెల్ల గువ్వలనేగాని రెండు పావురపు పిల్లలనే గాని పాపపరిహారార్థ బలిగా యెహోవా సన్నిధికి తీసికొని రావలెను" (లేవీ 5:7).అంతేకాదు"రెండు తెల్ల గువ్వలనైనను రెండు పావురపు పిల్లలనైనను తనకు దొరకని యెడల పాపము చేసినవాడు తూమెడు గోదుమ పిండిలో పదియవ వంతును పాపపరిహారార్థముగా తేవలెను" (లేవీ 5:11).

"రక్తము చిందింవకుండ పాపక్షమాపణ కలుగ నేరదు" అని హెబ్రీ 9:22 చెప్పుచున్నది.గోదుమపిండిలో రక్తమేమియు లేకపోయినను దాని స్థానములో అది అంగీకరించబడెను. వాస్తవం మేమంటే సామాన్య బీదవాని ఈ బలిని దేవుడంగీకరించును,తదుపరి వాని విషయమై యాజకుడు ప్రాయశ్చిత్త బలి అర్పించును. అతనికి క్షమాపణ కలుగును (లేవీ 5:13).ఇవ్విధముగా దేవుడు బీదవాని కొరకు ఏర్పాట్లు చేసెను. డబ్బులేనందున ఏ మానవుడు రక్షింపబడనేరక యుండడు.

**రక్తప్రోక్షణ**

కొన్ని దశలలోవారికి రక్తప్రోక్షణ కూడ వివిధస్థాయిలలో యుండును. ప్రధానయాజకుని విషయంలో అయితే ఆయాజకుడు ఆ జంతు రక్తములో తన వ్రేలుముంచి పరిశుద్ధ మందిరము యొక్క అడ్డతెర యెదుట ఆ రక్తములో కొంచెము ఏడు మారులు ప్రోక్షింపవలెను.అప్పుడు ఆ యాజకుడు ప్రత్యక్ష గుడారములో యెహోవా సన్నిధి నున్న సుగంధ ద్రవ్యముల ధూపవేదిక కొమ్ములమీద ఆ రక్తములో కొంచెము చమిరి గుడారము యొక్క ద్వారమునొద్దనున్న

దహనబలిపీఠము యొక్క అడుగున రక్త శేషమంతయు పోయవలెను (లేవీ 4:5-7). ఈ సంస్కార సంబంధ మైన మాదిరిని యేసుక్రీస్తు యొక్క బలిలో మనము మరల కనుగొనగలము (హెబ్రీ 9:24-25). పరిశుద్ధ స్థలములోనికి రక్తము కొనిపోబడగా, దానిశరీరము పాళెము వెలుపల దహించబడును.

ప్రధాన యాజకుని విషయంలోను, సర్వసమాజవిషయంలోను రక్తము సుగంధద్రవ్యముల ధూపవేదిక కొమ్ముల మీద చమరబడవలెను. ఈ రెండు సందర్భములలోను పరిహారము ప్రాముఖ్యము. ప్రధాన యాజకుడు పాపము చేసినా, సర్వసమాజము పాపము చేసినా వారి పాపమునకు ప్రాయశ్చిత్తము, పరిహారము జరుగవలెను.

ఏలికయైన వాడు పాపము చేయగా దహనబలి పీఠపు కొమ్ములమీద రక్తము చమరబడవలెను. దహన బలిపీఠము గుడారము యొక్క ఆవరణములో యుండెను. దహనబలి పీఠపు కొమ్ములు కూడ ఆకాశము వైపు(పరలోకము వైపు) ఎత్తబడి యుండెను. సుగంధ ద్రవ్యముల ధూపవేదిక పై నున్న కొమ్ములు, దహన బలిపీఠము మీద నున్న కొమ్ములు కూడ వాటి నాలుగు మూలల యుంచబడెను. సామాన్య యూదుని విషయంలో కూడ దహన బలి పీఠపు కొమ్ముల మీద రక్తము చమరబడవలెను.

**బలి పశువు యొక్క కళేబరము**

వధింపబడిన బలి పశువు యొక్క శరీరవిషయములో కూడ ప్రధాన యాజకుని యొక్కయు, సర్వసమాజము యొక్కయు పాపము యొక్క తీవ్రతను ప్రతిబింబించును. లేవీ యాజకధర్మములో యున్నవి క్రీస్తు యొక్క ఛాయ రూపకములని హెబ్రీపత్రిక లేఖకుడు తెలియజేయచున్నాడు.

ప్రధానయాజకుని యొక్కయు ప్రజల యొక్కయు పాపపరిహారార్థ రక్తము పరిశుద్ధ స్థలములోనికి కొనిపోబడు చున్నందున, ఆ ఎద్దుల యొక్క కళేబరములు శిబిరమునకు వెలుపల దహింప బడుచుండెను "వేటి రక్తము పాప పరిహారార్థముగ పరిశుద్ధ స్థలములోనికి ప్రధాన యాజకుని చేత తేబడునో, ఆ జంతువుల కళేబరములు శిబిరమునకు వెలుపల దహింపబడును." (హెబ్రీ 13:11). "కావున యేసు కూడ

తన స్వరక్తము చేత ప్రజలను పరిశుద్ధ పరచుటకై గవిని వెలుపల శ్రమపొందెను" (హెబ్రీ13:12).

యేసు యెరూషలేము వెలుపల సిలువవేయబడెను. ఆయన సిలువ వేయబడాలని అరచిన ప్రజలు ఆయనను నిరాకరించుటకిది ఒక నిదర్శనము. బలి యర్పింపబడిన జంతువు యొక్క కళేబరము శిబిరము వెలుపల దహించబడెను. దేవునికి ఇంపైన సువాసనగా అది దహన బలిపీఠము మీద దహించబడలేదు. ఈ ఎద్దులను దహించిన యగ్ని సెరాపుల అగ్ని,అనగా దైవిక ఉగ్రత సంబంధమైన యగ్ని. పాపము యెడల ఆయన కోపోద్రిక్తమైన అగ్ని అది. అందు వలన పాప పరిహారార్థ బలిశిబిరము వెలుపల దహించబడెను.

ఏలికయైన అధికారి విషయం లోను, సామాన్య మానవుని పాపపరిహార విషయంలోను పరిశుద్ధ స్థలములోనికి రక్తము కొనిపోబడలేదు. కళేబరము కూడ సువాసనగా బలిపీఠము మీద దహించబడలేదు. గాని ఆది బలిఅర్పించు సమయమందున్న యాజకునిదగును (లేవీ7::7-10). యాజకుడు బలి పశువు యొక్క భాగములను విడదీయ నవుసరమం లేదు ఏలయనగా దానినంతా అతడు పొందును. "యాజకులలో ప్రతిమగ వాడు దానిని తినవలెను;అది అతి పరిశుద్ధము" అని లేవీ 6:29 చెప్పుచున్నది. పాప పరిహారార్థ బలిగా అర్పించిన దానిని పరిశుద్ధ స్థలమందు అనగా ప్రత్యక్షపు గుడారము యొక్క ఆవరణములో తినవలెనని లేవీ 6:26 చెప్పుచున్నది. సమాధాన బలివిషయంలో వలనే దీనిని ప్రక్షత్యగుడారము యొక్క ఆవరణములో తినుటలో యున్న ప్రయోజనం ఒక్కటే,తినేవారిలో మాత్రం వ్యత్యాసం కనబడును. అక్కడ దేవుడే విందు నిచ్చువానిగా యుండును. ప్రధానయాజకుడు సర్వసమాజము, ఏలికయైన అధికారి, సామాన్యుడు కూడ తిరిగి దేవుని సహవాసమునకు చేర్చబడుటను దేవుడు ఈ రీతిగ పండుగ వాతావరణంలో జరిగించుచున్నారు.

# పూజ్యుడు
## (Reverend)

ఈ లోకంలో అధిక సంఖ్యాకులు ఇతరులచే ప్రశంసించబడాలని ఘనపరచబడాలని కాంక్షిస్తుంటారు. అందువలన క్రైస్తవ నాయకులమని ఆరోపించుకొనే కొందరు దర్పముతో కూడిన బిరుదులను (Adulatory titles) ధరించుకొంటారు; మరి కొన్ని సంస్థలు ఇటువంటి బిరుదులను ఆర్భాటముగా ప్రధానం చేస్తుంటాయి. ఈ క్రైస్తవ బిరుదాంకితులకు దైవాత్మ ప్రేరణతో లిఖించబడిన బైబిలు ఏమి ఉపదేశిస్తున్నది? ఆధ్యాత్మిక విషయాల్లో ఉద్భవించే ప్రశ్నలకు కచ్చితమైన సమాధానం ఇచ్చే అధికార పూర్వకమైన ఏకైక ప్రామాణిక గ్రంథం– బైబిలు. నరుని దైవ సమానునిగా చేసి (Deifying) 'రెవరెండ్' ( Reverend, Right Reverend, Most Reverend, Holy Reverend) అనే బిరుదులు గూర్చి పరిశుద్ధ లేఖనాలు ఏమి ఉపదేశిస్తున్నాయో పరిశీలిద్దాం.

'రెవరెండ్' అనే ఆంగ్ల శబ్దం– 'Reverendus' అను లాటిన్ పదం నుండి వచ్చింది. "Holy and Reverend is His name"(Psalm 111:9) అని, ASV,KJV,KJ21,AKJV,WBT,JUB,BRG వంటి ఆంగ్ల తర్జుమాలలో కన్పిస్తుంది. "ఆయన నామము పరిశుద్ధమైనది పూజింపదగినది"(కీర్తన 111:9). తెలుగు బైబిలు అనువాద ప్రకారం 'రెవరెండ్'అంటే 'పూజింపదగినది' లేక 'పూజనీయుడు'అని అర్థం. దీనికి హెబ్రీ భాషలో'యారే'అను పదం వాడబడింది; ఈ పదానికి పూజార్హుడు (Worthy of Worship), పూజ్యుడు (Deserved to be Worshiped), భక్తిభావన కల్గించువాడు( Awe-inspiring), భయంకరుడు( Fearful, Dreadful), అని నిర్వచనం. నరుడెవడును పూజ్యుడుకాడని, ఆరాధనకు అర్హుడుకాడని ప్రతి క్రైస్తవుని యొక్క ప్రగాఢ నమ్మకం. బైబిలు అధికారమునకు లోబడు క్రైస్తవులెవ్వరును ఈ సత్యమును కాదనజాలరు. గాని 'పూజార్హుడు' అనే దైవతుల్యునిగా భావింపజేయు 'రెవరెండ్' అను బిరుదును ధరించుకోవడానికి అనేకులు సాహసమెందుకు చేస్తున్నారన్నదే ప్రశ్న? ఏ క్రైస్తవుడైనను ఇతరులచే 'రెవరెండ్' (పూజ్యుడు)అని పిలుచుకోవటం లేదా సంభోదించటం కూడా శాపగ్రస్తమే!

"నీవు ఇతనితో సమానుడవని

మీరు నన్నెవనికి సాటి చేయుదురు? అని అడుగుచున్నాడు"(యెషయా 40:25). అపొస్తలుడైన పేతురు 'రెవరెండ్' వలె ప్రవర్తించాడా?దేవుని దూతలు రెవరెండ్లా? ఈ క్రింది లేఖనాలను గమనించండి. "పేతురు లోపలికి రాగా కొర్నేలి అతనిని ఎదుర్కొని అతని పాదముల మీదపడి నమస్కారము చేసెను. అందుకు పేతురు నీవు లేచి నిలువుము,నేను కూడ నరుడనే అని చెప్పి అతనిని లేవనెత్తాడు" (అపొ 10:25,26).

"జనసమూహములు పౌలు చేసిన దానిని చూచి,లుకయోనియ బాషలో దేవతలు మనుష్యరూపము దాల్చి మనయొద్దకు దిగి వచ్చి యున్నారని కేకలు వేసి పౌలు ముఖ్య ప్రసంగి యైనందున అతనికి హెర్మే అనియు పేరుపెట్టిరి. పట్టణమునకు ఎదురుగా ఉన్న ద్యుపతి యొక్క పూజారి యెడ్లను పూలదండలను ద్వారముల యొద్దకు తీసికొనివచ్చి సమూహముతో కలసి,బలి అర్పింపవలెనని యుండెను. అపొస్తలులైన బర్నబాయు పౌలును ఈ సంగతి విని,తమ వస్త్రములు చించుకొని సమూహములోనికి చొరబడి అయ్యలారా,మీరెందుకీలాగు చేయుచున్నారు? మేము కూడ మీ వంటి స్వభావముగల నరులమే. మీరు ఈ వ్యర్థమైనవాటిని విడిచి పెట్టి,ఆకాశమును భూమిని సముద్రమును వాటిలో ఉండు సమస్తమును సృజించిన జీవముగల దేవుని వైపు తిరుగవలెనని మీకు సువార్త ప్రకటించుచున్నాను. (అపొ14:11-15).

యోహాను నేను ఈసంగతులను వినినవాడను చూచినవాడను;నేను విని చూచినప్పుడు వాటిని నాకు చూపుచున్న దూత పాదముల యెదుట నమస్కారము చేయుటకు సాగిలపడగా, అతడు వద్దు సుమీ,నేను నీతోను, ప్రవక్తలైన నీ సహోదరులతోను, ఈ గ్రంథ మందున్న వాక్యములను గైకొనువారితోను సహదాసుడను; దేవునికే నమస్కారము చేయుమని చెప్పెను"(ప్రకటన 22:8,9). వారు తమకు తాము బలహీనులమైన జీవులమని ఆరోపించుకొన్నారు;వారికి సాగిలపడబోయిన వారిని నివారించారు. 'సాగిలపడుట' పూజాభావాన్ని సూచిస్తుంది (నిర్గమ 20:3,4). ఏ నరుడైనను అపొస్తలుడైనను దేవదూతైనను 'పూజనీయుడు' (Reverend) కాదు అని పై లేఖనాలు తేటగా బోధిస్తున్నాయి.

"మొర్దెకై వంగకయు నమస్కరింపకయు నుండుట (Bowed not, nor reverence) హామాను చూచినప్పుడు బహుగా కోపగించి మొర్దెకై ప్రాణము మాత్రము తీయుట స్వల్పకార్య మని యెంచి,మొర్దెకై యొక్క జనులు ఎవరైనది తెలిసికొని,అహష్వేరోషు యొక్క రాజ్యమందంతట నుండి మొర్దెకై సర్వజనులగు యూదుల నందరిని సంహరించుటకు ఆలోచించెను" (ఎస్తేరు 3:5,6). ఈ హామాను వలెనే నేటి కాలములోని అనేక బోధకులు తమని 'పూజ్యుడు' (రెవరెండ్) అని మర్యాద పూర్వకముగా సంబోధించి ఘనపరచకపోతే మహోగ్రులైపోతారు."వారు దేవుని యందు ఆసక్తి గలవారని వారిని గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాను. అయినను వారి ఆసక్తి జ్ఞానానుసారమైనది కాదు. ఏలయనగా వారు దేవుని నీతి నెరుగక తమ స్వనీతిని స్థాపింప బూనుకొనుచు దేవుని నీతికి లోబడలేదు"(రోమా 10:2,3) ఇది ఎంత భక్తిహీనమైన వైఖరి!

సత్యము కొరకై నిరసనను వ్యక్తపరచే విషయములో మనం షద్రకు,మేషాకు,అబెద్నెగో, దానియేలు,మరియు క్రీస్తును మాదిరిగా తీసుకోవాలి (దానియేలు 3:12). నెబుకద్నెజరు చక్రవర్తితో షద్రకు,మేషాకు, అబెద్నెగో ఇట్లున్నారు: "రాజా,నీ దేవతలను మేము పూజింపమనియు, నీవు నిలువబెట్టించిన బంగారు ప్రతిమకు నమస్కరింపమనియు తెలిసికొనుము" (దానియేలు3:18). దండనవిధింపబడిన పిమ్మట,మండుచున్న వేడిమిగల అగ్నిగుండము నుండి ఆ ముగ్గురు తిరిగి వచ్చినపుడు అందరి సమక్షమున నెబుకద్నెజరు దేవుని ఘనపరిచాడు. "షద్రకు,మేషాకు,అబేద్నెగోయను వీరి దేవుడు పూజార్హుడు"(దానియేలు 3:28).

"రాజు సముఖమునకు వచ్చి శాసన విషయమును బట్టి రాజా,ముప్పది దినములవరకు నీకు తప్ప మరి ఏ దేవునికైనను మానవునికైనను ఎవడును ప్రార్థన చేయకూడదు;ఎవడైనను ప్రార్థన చేసిన యెడల వాడు సింహముల గుహలో పడద్రోయబడునని నీవు ఆజ్ఞ ఇయ్యలేదా? అని మనవి చేయగా,రాజు మాదీయుల యొక్కయు పారసీకుల యొక్కయు పద్ధతి ప్రకారము ఆ సంగతి స్థిరము;ఎవరును దాని రద్దుపరచజాలరనెను.అందుకు వారు చెరపట్టబడిన యూదులలోనున్న ఆ దానియేలు,నిన్నేగాని నీవు పుట్టించిన

శాసనమునే గాని లక్ష్యపెట్టక,అనుదినము ముమ్మారు ప్రార్థనచేయుచు వచ్చు చున్నాడనిరి"(దానియేలు 6:12,13). తత్ఫలితముగా గుహలో వేయబడిన దానియేలును తీసిన తర్వాత రాజగు దర్యావేషు దేవుని మహిమపరిచాడు. "నా సముఖమున నియమించిన దేమనగా నా రాజ్యములోని సకల ప్రభుత్వముల యందుండు నివాసులు దానియేలు యొక్క దేవునికి భయపడుచు ఆయన సముఖమున వణకుచుండవలెను.ఆయనే జీవముగల దేవుడు,ఆయనే యుగయుగములు ఉండువాడు. ఆయన ఆధిపత్యము తుదమట్టునకుండును"(దానియేలు 6:26).

"మరల అపవాది మిగుల ఎత్తయిన ఒక కొండ మీదకి ఆయనను తోడుకొనిపోయి ఈలోకరాజ్యములన్నిటిని, వాటి మహిమను ఆయనకు చూపి నీవు సాగిలపడి నాకు నమస్కారము చేసినయెడల వీటన్నిటిని నీ కిచ్చెదనని ఆయనతో చెప్పగా,యేసు వానితో సాతానా, పొమ్ము; ప్రభువగు నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెనని వ్రాయబడియున్న దనెను (మత్తయి 4:8-10). ఈ సంభాషణ యొక్క సారాంశమును బట్టి సాతానుడు కూడ పూజార్హుడు కాడు.కాడు.ఆరాధింపబడుటకు అనలే యోగ్యుడు కాడు. "యెహోవాను నేనే;ఇదే నా నామము మరి ఎవనికిని నా మహిమను నేనిచ్చువాడను కాను"(యెషయా 42:8)."యెహోవా నామమునకు చెందవలసిన ప్రభావమును ఆయనకు ఆరోపించుడి"(కీర్తన 29:2). "అయితే నేటి మిధ్యాపూజార్హుల(Pseudo Reverends), అబద్ధ రెవరెండ్ల (FalseReverends), సంగతిఏమిటి? తమకు తామే పూజార్హులుగా ప్రకటించుకొనే ఇటువంటి వారిని గూర్చి లేఖనాలు ఏమని హెచ్చరిస్తున్నాయి? "మొదట భ్రష్టత్వము సంభవించి నాశనపాత్రుడగు పాపపురుషుడు బయలుపడితేనే గాని ఆ దినము రాదు. ఏదిదేవుడనబడునో, ఏదిపూజింపబడునో, దానినంతటిని ఎదిరించుచు, దానికంతటికిపైగా వాడు తన్నుతానే హెచ్చరించుకొనుచు,తను దేవుడనని తన్ను కనుపరచుకొనుచు,దేవుని ఆలయములో కూర్చుండును గనుక ఏవిధముగానైనను ఎవడును మిమ్మును మోసపరచ నియ్యకుడి"(2 థెస్స 2:3,4). వ్యక్తిగత ప్రాధాన్యత ఘనతలకై తీవ్ర వాంఛగల

మనస్తత్వం నుండి పుట్టినదే ఈ బిరుదుల వ్యవహారం : "ప్రధానత్వము కోరుచున్న దియొత్రేఫే మమ్మును అంగీకరించుట లేదు" (3యోహాను 1:3). ఈ వ్యతిరేక ధోరణిని లేఖనాలు ఖండిస్తున్నాయి.

ఈ ఉదాహరణలను గమనించండి: "అతడు తన రాజ ధానియగు బబులోనులోనినగరునందు సంచరించు చుండగా,రాజు బబులోనను ఈ మహా విశాల పట్టణమునా బలాధికారమును నా ప్రభావఘనతను కనపరచుటకై నా రాజధాని నగరముగా నేను కట్టించినది కాదా అని తనలో తాననుకొనెను. రాజు నోట ఈమాట యుండగా ఆకాశమునుండి యొక శబ్దము వచ్చెను,ఏదనగా రాజగు నెబుకద్నెజరూ,యిదే నీకు ప్రకటన నీ రాజ్యము నీయొద్దనుండి తొలగిపోయెను. తమయొద్ద నుండి మనుష్యులు నిన్ను తరిమెదరు;సర్వోన్నతుడగు దేవుడు మానవుల రాజ్యముపైన అధికారి యైయుండి,తానెవనికి దాని అనుగ్రహింప నిశ్చయించునో వానికి అనుగ్రహించునని నీవు తెలిసికొనువరకు ఏడు కాలములు నీకీలాగు జరుగునని చెప్పెను. ఆ గడియలోనే ఆలాగున నెబుకద్నెజరునకు సంభవించెను;మానవులలో నుండి అతని తరిమిరి,అతడు పశువులవలె గడ్డిమేసెను, ఆకాశపు మంచు అతని దేహమును తడపగా అతని తలవెంట్రుకలు పక్షిరాజు రెక్కల ఈకెలవంటివియు అతని గోళ్లు పక్షుల గోళ్లవంటివియు నాయెను" (దానియేలు 4:28-33). హృదయమందు గర్వించిన చక్రవర్తికే ఇట్లయితే దైవమానునిగా 'రెవరెండ్'అని పిలిపించుకొను వారి గతి ఏమౌతుంది?

"బెల్షస్సరూ,అతని కుమారుడగు నీవు ఈ సంగతియంతయు ఎరిగి యుండియు,నీ మనస్సును అణచుకొనక, పరలోకమందున్న ప్రభువు మీద నిన్ను నీవే హెచ్చించుకొంటివి.....నీ ప్రాణమును నీ సకల మార్గములును ఏ దేవుని వశమున ఉన్నవో ఆయనను నీవు ఘనపరచలేదు.

ఆ రాత్రియందే కల్దీయుల రాజగు బెల్షస్సరు హతుడాయెను"(దానియేలు 5:22-30). దేవుని ఘనపరచుట ప్రతి మానవుని కర్తవ్యం. "అయితే అతడు స్థిరపడిన తరువాత అతడు మనస్సున గర్వించి చెడి పోయెను. అతడు ధూపపీఠము మీద ధూపము వేయుటకై యెహోవా మందిరములో ప్రవేశించి తన దేవుడైన యెహోవామీద ద్రోహము చేయగా యాజకుడైన అజర్యాయు అతనితో కూడ

ధైర్యవంతులైన యెహోవా యాజకులు ఎనుబది మందియు అతని వెంబడి లోపలికి పోయిరి. వారు రాజైన ఉజ్జియా, యెహోవా ధూపము వేయుటకై ప్రతిష్ఠింపబడిన అహరోను సంతతివారైన యాజకుల పనియేగాని నీ పని కాదు;పరిశుద్ధ స్థలములోనుండి బయటకి పొమ్ము,నీవుద్రోహముచేసియున్నావు, దేవుడైన యెహోవా సన్నిధిని ఇది నీకు ఘనత కలుగజేయదని చెప్పగా ఉజ్జియా ధూపము వేయుటకు ధూపార్తిని చేత పట్టుకొని రౌద్రుడై, యాజకుల మీద కోపము చూపెను. యెహోవా మందిరములో ధూపపీఠము ప్రక్కనతడు ఉండగా యాజకులు చూచుచునే యున్నప్పుడు అతని నొసట కుష్ఠరోగము పుట్టెను"(2 దిన 26:16-19). దేవునిపై తిరుగుబాటు ఘనత కలుగజేయలేదు. పైగా ఉజ్జియా శిక్షింపబడినాడు.

ఒక వ్యక్తి యొక్క గొప్పతనాన్ని మితిమీరి పొగడినా స్తుతించినా అతడు అత్యధికముగా అతిశయించి ఆహంకారిగా మారే అవకాశం ఉంది. "నియమింపబడిన దినమందు హేరోదు రాజవస్త్రములు ధరించుకొని న్యాయపీఠము మీద కూర్చుండి వారి యెదుట ఉపన్యాసము చేయగా,జనులు ఇది దైవస్వరమే కాని మానవస్వరము కాదని కేకలువేసిరి. అతడు దేవుని మహిమపరచ నందున వెంటనే ప్రభువు దూత అతని మొత్తెను గనుక పురుగులుపడి ప్రాణము విడిచెను"(అపొ 12:21-23). దేవుడు తమకు అనుగ్రహించిన ఔన్నత్యమునుబట్టి దేవుని మహిమపరచనందున నెబుకద్నెజరు, బెల్షస్సరు, ఉజ్జియా, మరియు హేరోదు తక్షణమే శిక్షకు పాత్రులయ్యారు.

"మీరేమి చేసినను సమస్తమును దేవుని మహిమకొరకు చేయుడి" (1కొరింథీ 10:31). "నీవు నరుని శ్రద్ధతో పట్టించుకొనుటకు వాడేపాటివాడు?" (కీర్తన 8:4). మనుష్యులను అమితముగా ప్రశంసించే అలవాటును మానుకోవాలి. స్తుతికరమైన బిరుదులను(Eulogistic Titles) ప్రదానంచేయటాన్ని,కొందరిని ప్రత్యేక హోదాగల వారిగా అభిషేకించ టాన్ని (Annoint) ప్రతిఘటించాలి అని ఎలీహు హెచ్చరిస్తున్నాడు;"మీరు దయచేసి వినుడి నేను ఎవరి యెడలను పక్షపాతినై యుండను. నేను ఎవరికిని ముఖస్తుతికై బిరుదులు పెట్టను. ముఖస్తుతి చేయుట నా చేతకాదు. అట్లు చేసినయెడల నన్ను సృజించినవాడు నన్ను శీఘ్రముగా

నిర్మూలము చేయును'(యోబు 32:21,22).
సత్యానికి దైవభక్తికి తావియ్యక అనుచిత ప్రశంసకు ఆత్మస్తుతికి అహాన్ని తృప్తిపరచే విధంగా ఆడంబరాలకు పోరాదు.

క్రీస్తు భూమి మీద జీవిస్తున్న కాలములో "మంచివాడు"అని పిలిపించు కోటానికి కూడ ఆయన ఇష్టపడలేదు. "అందుకు యేసు నేను సత్పురుషుడనని యేల చెప్పుచున్నావు?దేవుడొక్కడే తప్ప మరి ఎవడును సత్పురుషుడు కాడు" (లూకా 18:19)."మీలో ఆలాగుండ కూడదు; మీలో ఎవడు గొప్పవాడై యుండ గోరునో వాడు మీ దాసుడై యుండవలెను" (మత్తయి 20:26,27)."మీలో అందరి కంటే గొప్పవాడు మీకు పరిచారకుడై యుండవలెను.తన్నుతాను హెచ్చించుకొను వాడు తగ్గింపబడును; తన్ను తాను తగ్గించు కొనువాడు హెచ్చించబడును"(మత్తయి 23: 11,12).ఈ ఆజ్ఞల సారాశం క్రైస్తవులు దర్పంతో ప్రవర్తించటాన్ని ఖండిస్తున్నాయి. మానవుడు 'పూజార్హుడు' కాడని ఉద్ఘాటిస్తున్నాయి; నరుని దేవునితో సమానునిగాజేసే అన్ని బిరుదులను నిషేధిస్తున్నాయి.గనుక 'రెవరెండ్'అను బిరుదును నీవు ధరించుకొన్నట్లయితే తక్షణమే దాన్ని త్యజించు; అది దేవునికి చెందినది. నీవు కేవలం మానవ మాత్రుడవు, పూజనీయుడవు కాదు! కొన్ని క్రైస్తవశాఖలు తమ సభ్యులను విశిష్టులు-యాజకవర్గం (Clergy), సామాన్యవర్గం (Laity) అని రెండుగా విభజించే బోధక్రొత్త నిబంధనకు అజ్ఞాతమైనది; ఇదొక వింతైన ఆచారం,అబద్ధ సిద్ధాంతం.క్రైస్తవులందరు సమానులు అని అనేక లేఖనాలు బోధిస్తున్నాయి.

క్రొత్తనిబంధనలో క్రైస్తవునికి ఉన్న కొన్ని పర్యాయపదాలు:
1.శిష్యులు(మత్తయి 28:19;అపొ 6:7),
2.విశ్వాసులు(అపొ 5:14;2 కొరి 6:15).
3.యాజకులు(1పేతురు 2:5,9; ప్రకటన 1:6;5:10,20:6).
4.పరిశుద్ధులు (రోమా 1:7).
5.స్నేహితులు(యోహాను 15:14,15; ఫిలోమోను 1:1).
6.సైనికులు(2 తిమోతి 2:3)
7.ప్రభువును పోలి నడుచుకొనువారు (1 థెస్స 1:6;1పేతురు 3:13
8.విజేతలు (రోమా 8:37)

9.దేవుని పిల్లలు(గలతీ 3:26)

10.కుమారులు,కుమార్తెలు(2కొరి 6:18)

11.దేవుని జనులు (1తిమోతి 6:11).

12.సోదరులు సోదరీలు(1తిమోతి 5:1)

13. పరిశుద్ధసోదరులు సోదరీలు (హెబ్రీ 3:1).

14.పరలోక పిలుపులో పాలివారు (హెబ్రీ 3:1).

15.దేవస్వభావమందు పాలివారు (2 పేతురు 1:4).

16.దేవునితోటి పనివారు(1 కొరి 3:9).

17.క్రీస్తు దాసులు (ఎఫెసి 6:6).

18.పరదేశులు, యాత్రికులు (హెబ్రీ 11:13; 1 పేతురు 1:1,2:11).

19.దేవుని ఆలయం,జీవంగల దేవుని ఆలయం (1 కొరి 3:16,17; 1 కొరి 6:16).

క్రైస్తవులుతమ విశ్వాసములోను ఆలోచనలోనువాక్కులోను ప్రవర్తనలోను స్వభావములోను పరిశుద్ధత కల్గి ఉండాలి; 'పరిశుద్ధుడు'(Saint) అనేది ఒక బిరుదు కాదు.అట్లనే ప్రతి క్రైస్తవుడు యాజకుడే(Priest) అని లేఖనాలు బోధిస్తున్నాయి.ఇది కొందరు క్రైస్తవులకు యాజక వర్గమునకు మాత్రమే వర్తించు బిరుదు కాదు.దేవుడు అనుగ్రహించిన పదజాలం మానవులకు తృప్తినిచ్చుటలేదు. 'క్రైస్తవుడు' అను పదానికి వెనుకగాని ముందుగాని ఇంకేమియు తగిలించుకొనే అవసరం లేదు.1 పేతురు 4:16 ఇట్లు ఆజ్ఞాపిస్తున్నది.

"ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమపరచవలెను". నీవు క్రైస్తవునిగా మాత్రమే ఉండుము; దాని కంటే ఎక్కువ అవసరం లేదు, తక్కువ కూడా కాదు,ఇంక ఏది కాదు!

పి.ఐ.సబ్బతి.

# సంక్షిప్త వార్తలు

2015 ఆగస్టు 2వ తేదీ ఆదివారం సికింద్రాబాదు యాప్రాల్‌లో యున్న క్రీస్తుసంఘ ఆరాధనలో సోదరులు పి.సురేంద్రకుమార్(BHEL)గారు వాక్యపరిచర్యచేయగా సోదరులు ఎలిపే ప్రభాకర్‌గారు(కాకినాడ) ప్రభురాత్రి భోజన కార్యక్రమమును నిర్వహించిరి..తదుపరి ఆరాధన అనంతరము అక్కడకు 15కిలోమీటర్ల దూరంలో యున్న షామిర్‌పేటకు సభ్యులందరు కార్లలోను,వేన్‌లోను వెళ్లి అక్కడ సోదరులు లెమూయేల్ గారికి చెందిన సమారు 6ఎకరాల విస్తీర్ణ అవరణములో వేయబడిన షామియానా క్రింద స్తుతికూటమును జరిగించిరి.ఆ కూటములో సోదరులు ఎలిపే ప్రభాకర్ గారు వాక్యపరిచర్య చేసిరి.వచ్చిన వారందరికీ మంచి ప్రేమవిందు ఏర్పాటు చేయబడెను.

2015 ఆగస్టు 7,8 తేదీలలో కాకినాడ సత్యవాణి–క్రీస్తుసంఘ ఆవరణలో రెండు దినముల బైబిలుక్లాసు బోధకుల కొరకు నిర్వహించబడెను. ఆ ప్రత్యేక తరగతికి 35మందినే పిలువగా 45మంది హాజరైరి.తెలంగాణ సహోదరులు కొంతమంది దానిలో పాల్గొనిరి.సోదరులు రిక్కీగూటం, ఎలిపే ప్రభాకర్,జాషువాగూటం గార్లు ఆ రెండు దినములు చక్కటి వాక్యోపదేము గావించిరి.హాజరైన వారందరు ఆత్మీయ సహవాసము ననుభవించుటయే గాక,దేవుని గ్రంధమునుండి అనేక గొప్పసంగతులు నేర్చుకొనగల్గిరి.మరల సెప్టెంబరులో ఇంచుమించు అదే తేదీలలో ప్రత్యేక బైబిలు తరగతి నిర్వహించుటకు అందరును సంకల్పించిరి.

2015 ఆగస్టు 13వ తేదీ గురువారం విశాఖపట్టణం అక్కయ్యపాలెంలో యున్న క్రీస్తుసంఘ అధ్వర్యములో ఆంధ్ర,తెలంగాణ రాష్ట్రసువార్తికుల సదస్సు ఏర్పాటు చేయబడెను.అక్కయ్యపాలెంలో యున్న షాదీఖాన కమ్యూనిటిహాలులో ఈ సదస్సు జరుగగా వందలాది సోదరులుహాజరైరి. సోదరులు చుక్కా మాణిక్యరావు,కె.బి.బి.చంద్రపాల్,సి.హెచ్.జేకబ్,పి.డి.బిషప్,టి.వి.సాంసన్‌రాజ్, గంటా ఫిలిప్,జాషువాగూటం గార్లును తదితరులును వాక్య పరిచర్యచేసిరి.

సోదరులు చంద్రశేఖర్‌గారు ప్రత్యేకశ్రద్ధవహించి కార్యక్రమం అంతా సక్రముగా నిర్వహించబడునట్లు పర్యవేక్షించిరి.

2015 ఆగస్టు 28వ తేదీ శుక్రవారం ఉదయం విశాఖ జిల్లా యలమంచిలి మండలం అచ్చుతాపురంలో నిర్మించబడిన S.K.గ్రేండ్ గృహసముదాయంలో రిక్కీ,రోగీ,రాబిన్‌గూటం గార్ల ఆధ్వర్యములో నిర్వహించబడిన స్తుతికూటములో జాషువాగూటం గారు వాక్యపరిచర్య చేసిరి. సోదరులు అబ్రాహాము గారు(గోపాలపట్నం),యస్ యేసుదాసు(వలసపాకల), ప్రార్ధనలు చేసిరి.కూటం అంతయు ఆహ్లాదకర వాతవరణంలో జరిగెను. ప్రేమవిందులో అందరు పాల్గొని దేవుని స్తుతించిరి.

2015 నవంబరు మొదటివారములో కాకినాడ సత్యవాణి లో జరుగు బైబిలు లెక్చర్‌షిప్‌కు వచ్చుటకు మీరు ఇప్పటినుండి యే సిద్ధపడవలసినదని మనవి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.